నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, గురువారం 18 జూలై 2024 | NALGONDA

## చింతపల్లిలో తాగునీటి కష్టాలు


చింతపల్లి మండల కేంద్రంలోని ఓ ఇంట్లో ట్యాంకర్ ద్వారా పోయించుకుంటున్న నీరు

మాల్, జూలై 17 : చింతపల్లి మండల కేంద్రంలో వారం రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. గ్రామానికి నీటిని సరఫరా చేసే మోటర్లు చెడిపోయాయని, వాటికి మరమ్మతులు చేసేందుకు నిధులు లేవని పంచాయతీ అధికారులు సమాధానం ఇస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, తామేమీ చేయలేమని చెబుతున్నారని పేర్కొంటున్నారు. దాంతో గ్రామస్తులు డబ్బులు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

# భక్తి పారవశ్యం

**సంబురంగా తొలి ఏకాదశి.. మొహర్రం వేడుకలు**

**హిందూ, ముస్లింల పండుగలు ఒకే రోజు కలిసి రావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ క్షేత్రాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. మరోవైపు మొహర్రం పురస్కరించుకొని పీర్ల ఊరేగింపు సందడిగా కొనసాగింది. డప్పు చప్పుళ్ల మధ్య ఇంటింటికీ వచ్చిన పీర్ల సవారీలకు ప్రజలు దట్టీలు, కుడుకలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.**

– రామగిరి, జూలై 17


పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


నల్లగొండ పాత బస్తీలో పీర్ల ఊరేగింపు

# సాగర్‌పై చిగురిస్తున్న ఆశలు

## నిండిన కర్ణాటక ప్రాజెక్టులు

**కృష్ణా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు**

**సాగర్‌లో 504.60 అడుగుల్లో నీరు**

కృష్ణానదీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కర్ణాటకలోని అన్ని ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ఆయా ప్రాజెక్టులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆల్మట్టి ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్ గేట్లు ఎత్తితే ఇక కృష్ణానదిపై రాష్ట్ర పరిధిలోని తొలి ప్రాజెక్టు జూరాలకు వరద నీరు రానున్నది. జూరాలలో కూడా ఇప్పటికే నీరు నిల్వ ఉండడంతో పై నుంచి వరద ఉధృతి కొనసాగితే మూడునాలుగు రోజుల్లోనే జలాలు శ్రీశైలం ప్రాజెక్టుకు తరలిరానున్నాయి. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం 11 రోజుల ముందుగానే ఆల్మట్టి డ్యామ్ గేట్లు తెరుచుకోవడం విశేషం. దాంతో ఈ ఏడాది పరిస్థితి ఆశాజనకంగానే ఉంటుందన్న అంచనాలతో నాగార్జునసాగర్ ఆయకట్టుపై ఆశలు చిగురిస్తున్నాయి.

– నల్లగొండ ప్రతినిధి, జూలై 17 (నమస్తే తెలంగాణ)


నాగార్జునసాగర్ జలాశయం ప్రస్తుతం ఇలా..

వారం రోజులుగా కృష్ణానది జన్మస్థానం మహాబలేశ్వరంతో పాటు పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో కృష్ణానదిలో వరద ఉధృతితో ప్రాజెక్టులన్నీ ఒక్కొక్కటి నిండుతూ వస్తున్నాయి. కృష్ణా నదిపై తొలి ప్రాజెక్టు ఆల్మట్టి పూర్తిగా నిండడంతో మంగళవారం సాయంత్రమే 14 గేట్లు ఎత్తి 65వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఆ తర్వాత ఇన్‌ఫ్లో కొద్దిగా తగ్గి బుధవారం ఉదయం 6గంటలకు ఆల్మట్టికి 61,683 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదైంది. పవర్ హౌస్ ద్వారా అవుట్‌ఫ్లోగా 17,563 క్యూసెక్కుల నీటిని నారాయణపూర్ డ్యామ్‌కు విడుదల చేస్తున్నారు. ఆల్మట్టికి ఎగువ నుంచి ఏ మాత్రం ఇన్‌ఫ్లో పెరిగినా ఆ నీరంతా దిగువకే విడుదల చేయనున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లో సైతం ప్రస్తుతం 37.64 టీఎంసీల కెపాసిటీకి గానూ 28.76టీఎంసీ నీరు నిల్వ ఉంది. ఎగువ వరదను బట్టి డ్యామ్ గేట్లను త్వరలోనే ఎత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత జూరాల ప్రాజెక్టుకు వరద రానుంది. జూరాలలో ప్రస్తుతం 9.66 టీఎంసీకుగానూ 7.66 టీఎంసీ నీరు నిల్వ ఉంది.

### ఇక పైన ఏమాత్రం వానలు కురిసినా..

ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు 3,585 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలంలో ప్రస్తుతం 215.80 టీఎంసీల నీటి నిల్వకు గానూ 33.62 టీఎంసీలు ఉంది. శ్రీశైలం నుంచి విద్యుత్తు ఉత్పత్తి ద్వారా 30,912 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లోగా నాగార్జునసాగర్‌కు చేరుతుంది. దాంతో సాగర్ నీటిమట్టం బుధవారం సాయంత్రం 6గంటలకు 504.60అడుగులకు చేరుకుంది. పూర్తి స్థాయి నీటినిల్వ 312.50 టీఎంసీలకు గానూ 122.68టీఎంసీల నీరు ప్రస్తుతం ఉంది. గతేడాది ఆల్మట్టిలో ఇదే రోజు పరిశీలిస్తే 26టీఎంసీలే ఉండగా ప్రస్తుతం 99.24 టీఎంసీలు ఉండడం విశేషం. నారాయణపూర్, జూరాల, తుంగభద్ర డ్యామ్‌లలో సైతం గతేడాదితో పోలిస్తే ఈ సారి అదనపు నీటి నిల్వలే కనిపిస్తున్నాయి. దీని వల్ల ఇక ముందు ఎగువన ఏ మాత్రం వర్షాలు కురిసినా ఆ వరద శ్రీశైలం వైపునకే రానుంది. ఆ తర్వాత శ్రీశైలానికి వరద మొదలైతే విద్యుత్ ఉత్పత్తి ద్వారా సాగర్‌కు నీటిని విడుదల చేయవచ్చు. అందుకే నాగార్జునసాగర్ ఆయకట్టుపై ఆశలు చిగురిస్తున్నాయి.

# ఏఐఎం కోర్సు తెచ్చిన తంటా!

## ఎన్జీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం కొత్తగా ప్రవేశం

- దోస్త్ అడ్మిషన్ల ద్వారా పలువురు విద్యార్థుల చేరిక
- సంఖ్య తక్కువగా ఉండడంతో నిర్వహించలేమంటున్న ఎన్జీ కళాశాల
- జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి వచ్చిన చేరిన విద్యార్థుల అయోమయం




రామగిరి, జూలై 17 : నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కళాశాల తెలంగాణ రాష్ట్రంలోనే పేరుగాంచింది. వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇక్కడికి చదువు కోసం వస్తుంటారు. ఈ కాలేజీలో 2024–25 విద్యా సంవత్సరం డిగ్రీ ప్రథమ సంవత్సరానికి నూతనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్‌లెర్నింగ్(ఏఐఎం)ను అందుబాటులోకి తెచ్చారు. దాంతో దోస్త్ అడ్మిషన్ల ద్వారా ఈ కోర్సులో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు విద్యార్థులు చేరారు. ఈ నెల 11న కళాశాలలో ఫీజు కూడా చెల్లించారు. ఇక తరగతులకు వెళ్లాల్సిన సమయంలో కోర్సును నిర్వహించలేమంటూ కళాశాల నుంచి విద్యార్థులకు ఫోన్ వచ్చింది. దాంతో కోర్సులో చేరిన విద్యార్థులు ఆందోళనలో పడ్డారు. ఇప్పటికే దోస్త్ అడ్మిషన్లు పూర్తి కాగా మొదటి, రెండో విడుతలో తాము తీసుకున్న కోర్సును వదిలేసి రావడంతో ఎటు కాకుండా పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కోర్సు కాబట్టి హైదరాబాద్ నుంచి వచ్చి చేరిన విద్యార్థులు కూడా ఇందులో ఉన్నారు.

### అనాలోచిత నిర్ణయం

ఎన్జీ కళాశాలకు నూతనంగా వచ్చిన ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, అధ్యాపక బృందం కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యామండలి సహకారంతో కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఏఐఎం కోర్సుపై ఇక్కడ విద్యార్థులకు ఎంత అవగాహన ఉంది? అందుబాటులోకి తేస్తే విద్యార్థులు చేరుతారా? అని ఆలోచన లేకుండా తీసుకొచ్చారు. దోస్త్ ఫేజ్ – 1, 2 అడ్మిషన్లు ముగిసే వరకు విద్యార్థులు పెద్దగా అడ్మిషన్లు తీసుకోలేదనే విషయం నిర్వాహకులకు తెలుసు. తక్కువ మంది ఏఐఎంను ఎంపిక చేసుకున్నారు. నిర్వహణ చేయలేమని ఆలోచనతో ముందస్తుగానే ఫేజ్–3లో ఆ కోర్సును దోస్త్ నుంచి తొలగించి ఉంటే విద్యార్థులు ఆ కోర్సును ఎంపిక చేసుకుండా ఉండేవారు. తీరా కోర్సులో చేరిన తర్వాత వేరే కోర్సులోకి వెళ్లండని చెప్పడంతో విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. ఇప్పటికే దోస్త్ అడ్మిషన్లు చాలా వరకు పూర్తికాగా నచ్చని కోర్సుల్లో ఎలా చేరాలని, ముందే కోర్సును దోస్త్ నుంచి తొలగిస్తే తమకు న్యాయం జరిగేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 15మంది కంటే తక్కువ ఉంటే కోర్సు నిర్వహించలేం

ఎన్జీ కళాశాలలో ఏఐఎం కోర్సును ఈ విద్యా సంవత్సరం అందుబాటులోకి తెచ్చాం. దోస్త్ చివరి ఫేజ్ ముగిసే వరకు ఆ కోర్సులో ఆరుగురు విద్యార్థులు మాత్రమే చేరారు. 15మందికి తక్కువ విద్యార్థులుంటే కోర్సు నిర్వహించడం కష్టం. దీనికి సంబంధించి ఉన్నత విద్యామండలి నిబంధనలు కూడా ఉన్నాయి. నేటి ఆధునిక కాలానికి అవసరమైన కోర్సు అయినప్పటికీ విద్యార్థులు ఎందుకు ఎంపిక చేసుకోలేదో అర్థం కావడం లేదు.

**- సముద్రాల ఉపేందర్, ప్రిన్సిపాల్, ఎన్జీ కళాశాల, నల్లగొండ**

### డాటా సైన్స్‌లో సీటు వదిలేసి వచ్చిన



మాది హైదరాబాద్. నేను దోస్త్ ద్వారా నిజాం కళాశాలలో బీఎస్సీ డాటా సైన్స్‌లో సీటు సాధించాను. నల్లగొండ ఎన్జీ కళాశాలలో ఏఐఎం కోర్సు అందుబాటులోకి తేవడంతో దోస్త్ చివరి ఫేజ్‌లో దరఖాస్తు చేశా. అందులో నాకు సీటు వచ్చింది. ఈ నెల 11న కళాశాలకు వచ్చి ఫీజు చెల్లించి చేరాను. కోర్సుపై ఆసక్తితో నాన్‌లోకల్ అయినప్పటికీ భవిష్యత్ ఉంటుందని హైదరాబాద్ నుంచి ఇక్కడికి రావాలనుకున్నా. 'ఇప్పుడు కోర్సు నిర్వహించలేము.. మీరు ఇదే కళాశాలలో వేరే కోర్సులో చేరండి' అని కళాశాల నుంచి ఫోన్ చేశారు. వేరే కోర్సు చేయాలంటే నేను హైదరాబాద్‌లోనే ఉండేదాన్ని. ఇక్కడికి రావాల్సిన అవసరం లేదు కదా? వేరే కోర్సులో చేరాలంటే దోస్త్ అడ్మిషన్లు పూర్తిగా ముగిశాయి. ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల అనాలోచిత నిర్ణయం నా చదువు నాశం చేసేలా ఉంది. ఎంజీయూ అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి ఏఐఎం కోర్సు కొనసాగించి విద్యార్థులకు న్యాయం చేయాలి.

**- రుహినాబాను, విద్యార్థిని, హైదరాబాద్**

## 21న కేవీలో జిల్లాస్థాయి చెస్‌పోటీలు

రామగిరి, జూలై 17: అంతర్జాతీయ చెస్‌డేను పురస్కరించుకొని ఈ నెల 21న ఆదివారం జిల్లాస్థాయి బాల, బాలికల చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.కరుణాకర్‌రెడ్డి, ఆర్బిటర్ ఎం.విశ్వప్రసాద్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో అండర్ –11, 13, 15 విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామని, ప్రతి విభాగంలో విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వాట్సాప్ నంబర్ 99854 23823కు ఎంట్రీలు పంపించాలని కోరారు.

# గంజాయి ముఠా అరెస్ట్

- కొర్లపహాడ్ వద్ద 73 కిలోల గంజాయి స్వాధీనం

నీలగిరి, జూలై 17 : గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శనివారం హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కారులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు నల్లగొండ జిల్లా కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద శాలిగౌరారం సీఐ, కేతేపల్లి ఎస్ఐ, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఉదయం 10 గంటల సమయంలో సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన హుండాయ్ కారులో ఇద్దరు పురుషులు, ఒక స్త్రీ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని ఆపి తనిఖీ చేశారు. కారు డిక్కీలో గంజాయి ప్యాకెట్లు లభించడంతో వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అశోక్‌కుమార్(58), దీపు కుమార్(21), ఢిల్లీకి చెందిన సుష్మారాయ్(33) కారులో ఒడిశాలోని కలిమెల, మల్కాన్‌గిరి వెళ్లి అక్కడ సుశాంత్ వద్ద 89 ప్యాకెట్లలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో డెలివరీ చేసేందుకు వెళ్తున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రేమ్‌సింగ్ ఆదేశాలతో వీరు గంజాయి రవాణా చేస్తున్నట్లు తేలింది. రవాణా చేసినందుకు వీరికి ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున అందించారు. వారి నుంచి రూ.18,45,625 విలువైన 73.825 కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి రవాణా ముఠాను పట్టుకున్న శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, కేతేపల్లి ఎస్ఐ శివతేజ, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌బాబు, ఎస్ఐలు మహేందర్, మహేశ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# తొలి విడుతలో 82,999 మందికి రుణమాఫీ

- మొదట రూ.లక్ష వరకు ఉన్న వారికి మాత్రమే..
- లక్షలోపు ఉన్న రైతులకు కూడా పలు కారణాలతో ఆపిన ప్రభుత్వం
- నేటి సాయంత్రం రైతు వేదికల్లో కార్యక్రమాలు
- ఇప్పటికే రుణాలు చెల్లించిన వారికి పడుతయా..? లేదా..?





నల్లగొండ,/నల్లగొండ రూరల్, జూలై 17 : రైతు రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధం చేసింది. తొలి విడుతలో రూ. లక్షలోపు రుణాలు తీసుకున్నోళ్లకు మాఫీ చేయనున్నది. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో 82,999 మంది రైతులు ఉన్నారు. జిల్లాలో 5.60 లక్షల మంది రైతులు పలు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. తొలి విడుతలో రూ.లక్ష లోపు ఉన్న వారికి, ఈ నెలాఖరు వరకు రూ.1.5 లక్షలు, ఆగస్టు మొదటి వారంలో రూ.రెండు లక్షల రుణ మాఫీ చేయనున్నట్లు సర్కారు ప్రకటించింది. రుణమాఫీలో ప్రభుత్వం కోతలు పెట్టింది. ఇంట్లో ఉద్యోగస్తులు ఉన్న వారిని, ఆదాయపు పన్ను కడుతున్న వారిని పక్కకు పెట్టింది. ఈ మాఫీ డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023 వరకు తీసుకున్న వారికి వర్తించనుంది. రుణమాఫీపై గురువారం సాయంత్రం రైతు వేదికల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం వ్యవసాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది.

### రైతు వేదికల్లో కార్యక్రమాలు

అసెంబ్లీ ఎన్నికల ముందు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. మొత్తం మాఫీ ఒకేసారి చేస్తామని గతంలో కాంగ్రెస్ ప్రకటించినా.. ఇప్పుడు మాత్రం విడుతల వారీగా చేస్తున్నది. మూడు విడుతల్లో చేస్తామని చెబుతున్నది. తొలుత రూ.లక్ష లోపు రుణాలు ఉన్నోళ్లకు మాఫీ చేస్తామని ప్రకటించింది. దీంతో గురువారం సాయంత్రం రూ. లక్ష వరకు రుణాలు ఉన్న రైతులకు మాత్రమే రుణాలు మాఫీ కానున్నాయి. రుణమాఫీలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో రైతులు, ప్రజాప్రతినిధులతో కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం క్లస్టర్ వారీగా ప్రత్యేకంగా అధికారులను నియమించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సాయంత్ర నాలుగు గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఎవరైనా రైతులు కూడా మాట్లాడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రుణమాఫీ అనంతరం సంబురాలు నిర్వహించే అవకాశం ఉంది. రుణమాఫీపై నిర్వహించే కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని నల్లగొండ కలెక్టర్ సి. నారాయణరెడ్డి బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, మండల వ్యవసాయ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే కార్యక్రమానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకానున్నారు.

### రుణాలు కట్టినోళ్ల సంగతేంది..?

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి 2018 కటాఫ్‌గా నిర్ణయించింది. గత ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాలను 70శాతం వరకు మాఫీ చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా మిగతా వారికి మాఫీ కాలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 2018 వరకు తీసుకునోళ్లకే అని చెబుతుండటంతో వారంతా నష్టపోయే ప్రమాదం ఉంది. మరోవైపు బ్యాంకుల ఒత్తిడితో కొందరు రైతులు రుణాలు చెల్లించారు. ఇప్పటికే రుణాలు చెల్లించిన వారికి సర్కారు ఇస్తుందా..? లేదా అనేది స్పష్టత లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాత్రం ముందుగా రుణాలు చెల్లించినా.. తర్వాత ప్రభుత్వం వారికి డబ్బులు సమకూర్చింది.

